ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 9 నవంబరు 2025



కర్షకుడిపై కన్నెర్ర



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట



చింతలవంక ప్రాంతంలో గజసంచారం

మూడేళ్లుగా పులిచెర్ల మండలాన్ని వీడని ఏనుగుల మంద

కోల్పోతున్న పంటలతో సేద్యంపై ఆశ వదులుకుంటున్న రైతులు

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను గజరాజులు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. పంటలపై దాడులు చేస్తూ వారి కష్టాన్ని పొట్టనబెట్టుకుంటున్నాయి. పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి మూడేళ్ల కిత్రం పులిచెర్ల మండలంలోకి చేరుకున్న ఏనుగుల మంద కొన్నాళ్ల పాటు అప్పుడప్పుడూ వచ్చి పంటలను ధ్వంసం చేసి పోయేవి. అయితే ఆరు నెలలుగా మండలంలోనే తిష్ఠ వేసిన ఏనుగుల మంద రోజూ పంటలను ధ్వంసం చేయడం పనిగా పెట్టుకున్నాయి.మండల సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతాలు నివాసానికి అనువుగా ఉండడంతో పగలంతా అడవిలో ఉంటూ రాత్రి వేళ పొలాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాలైన చల్లావారి పల్లి, పాతపేట, కల్లూరు, పాళెం, దేవళంపేట, కమ్మపల్లి, గడ్డంవారి పల్లి, మంగళంపేట, ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి పంచాయతీల్లో పంటలు ఏనుగుల దాడుల్లో దెబ్బతింటున్నాయి.మండలంలో మామిడి, టమోటా పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. ఏనుగుల మంద మామిడిచెట్ల కొమ్మలను విరిచేస్తూ టమోటా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ముప్పై ఏళ్ల వయసున్న కొబ్బరిచెట్లను సైతం కూకటివేళ్లతో పెకలిస్తున్నాయి. ఇక వరి, అరటి, కూరగాయల పంటలనూ నాశనం చేస్తున్నాయి. అసలే సేద్యం గిట్టుబాటు కాక ఇబ్బంది పడుతున్న రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను చేతికొచ్చే సమయంలో ఏనుగుల గుంపు ధ్వంసం చేస్తుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలో ఇప్పటికే గజదాడుల్లో 225హెక్టార్ల వరి, 110హెక్టార్ల టమోటా, 200హెక్టార్ల మామిడిపంటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు సుమారు 600 కొబ్బరిచెట్లను ఏనుగుల గుంపు కూకటివేళ్లతో పెకలించాయి. పంటలపై ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు నిట్టూర్పు విడుస్తున్నారు. మండలాన్ని ఏనుగులు వదిలివెళతాయన్న నమ్మకం సన్నగిల్లుతుండడంతో సేద్యంపైనే ఆశలు వదులుకుంటున్నారు.

పరిహారం పదిశాతం!

గజదాడుల్లో పంటలను కోల్పోతున్న తమకు అటవీశాఖ తూతూమంత్రంగా పరిహారం చెలిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పొలాల వద్దకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్న అటవీశాఖ అధికారులు సరిగా పంట నష్టాన్ని లెక్కకట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బాధిత రైతుల్లో 30శాతం మందికి మాత్రమే నష్ట పరిహారం అందుతోందంటున్నారు.వారికి కూడా పంటల సాగుకు చేస్తున్న ఖర్చులో పదిశాతం కూడా పరిహారంగా ఇవ్వడం లేదంటున్నారు. మిగిలిన రైతులు పరిహారం కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగి తిరిగి ఫలితం లేకపోవడంతో దరఖాస్తు చేసుకోవడమే మానేశామంటున్నారు. ఏనుగుల మంద కట్టడికి ఇటీవల కుంకీ ఏనుగులను పలమనేరుకు తీసుకురావడంతో ఆశలు చిగురించాయని, అయితే కుంకీ ఆపరేషన్‌కు పరిస్థితులు అనుకూలించడం లేదని డీఎఫ్‌వో సుబ్బరాజు చెప్పడంతో ఆ ఆశ కూడా నిరాశగానే మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొబ్బరిచెట్టును కూకటివేళ్లతో పెకలించిన ఏనుగులు



గుండెకోత

● ట్రాక్టర్‌తో వరిపంటను దున్నేసిన అన్నదాత

యాదమరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట భారీవర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో ఓ రైతు పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. యాదమరి మండలం పెరుమాళ్ళపల్లెకు చెందిన రాజశేఖర రెడ్డి 2.30 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశాడు. పంట చేతికొచ్చే దశలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు పొలాలన్నీ నీట మునిగిపోయాయి. రోజుల తరబడి పొలంలో నీరు నిలిచిపోవడంతో వరి పూర్తిగా కుళ్ళిపోయి, కోలుకోలేని విధంగా నష్టం వాటిల్లింది. దీంతో పంటను పొలంలో ఉంచినా ప్రయోజనం లేదని భావించిన రాజశేఖర రెడ్డి తీవ్ర మనోవేదనతో శనివారం తన వరిపంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు.ప్రభుత్వం స్పందించి నష్టపోయిన ఇలాంటి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాల్సివుంది.

కుప్పం @ ఇండస్ట్రియల్ హబ్
6

ఆపరేషన్ 'రెడ్ శాండిల్'!

● 'ఎర్ర' స్మగ్లర్లపై మరోసారి ఉక్కుపాదం

ఎర్రచందనం జోలికొస్తే తాట తీస్తామంటూ హెచ్చరికలు.

స్మగ్లర్లకు సహకరించొద్దంటూ స్థానికులకు పిలుపు.

సెంటిమెంట్‌ను గుర్తుచేస్తూ స్మగ్లింగ్ అడ్డుకట్టలో భాగస్వాములు కావాలని శ్రీవారి భక్తులకు వినతి.

ఒక్క చెట్టూ నరక్కుండా చూడాలంటూ యంత్రాంగానికి ఆదేశాలు.

శనివారం నాటి తిరుపతి పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటల ఉద్దేశంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలన్న ప్రభుత్వ వైఖరిని స్పష్టంచేసింది. ఆపరేషన్ కగార్ తరహాలో త్వరలోనే స్మగ్లర్లపై చర్యలు ఉంటాయనీ ఆయన స్పష్టం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



టాస్క్‌ఫోర్సు యూనిఫామ్‌లా.. రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను పోలిన ప్యాంటు వేసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చారు. అది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారుల్లో ఉత్తేజాన్ని నింపింది.

● డిప్యూటీ సీఎం హెచ్చరికలతో స్పష్టమైన ప్రభుత్వ వైఖరి

● యంత్రాంగంపై పెరిగిన ఒత్తిడి

శేషాచల అడవుల నుంచి అంతర్జాతీయ మార్కెట్ దాకా పాతుకుపోయిన నెట్‌వర్క్‌తో వేల కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉక్కుపాదం మోపే పరిస్థితి కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి నుంచి జారీ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటన్నది స్పష్టమైపోయింది. ఆయన తిరుపతి పర్యటన, సంబంధిత శాఖతో నిర్వహించిన సమీక్షలతో అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. పవన్ ఆహార్యం ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రభుత్వ కఠిన వైఖరిని బలంగా చాటినట్టయింది. దీంతో 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కఠినంగా అడ్డుకునే ప్రయత్నాలు మళ్లీ మొదలైనట్టుగా భావించాల్సి వస్తోంది. మామండూరు అటవీ ప్రాంతంలో పర్యటించిన అనంతరం తిరుపతి మంగళంలోని ఎర్రచందనం గోదామును తనిఖీ చేశారు. అక్కడి భారీ పరిమాణంలో పోగుపడిన ఎర్రచందనం దుంగలను చూసి నిశ్చేష్టులయ్యారు. ఎన్ని లక్షల చెట్లు నరికి వుంటే ఇన్ని దుంగలు పట్టుబడ్డాయంటూ తీవ్ర వేదనకు లోనయ్యారు. ఇక పట్టుబడకుండా సరిహద్దులు దాటిన దుంగల పరిమాణం తలచుకుని ఆవేదన చెందారు.

వేంకటేశ్వరస్వామి సెంటిమెంట్‌తో..

'తిరుమలలో శ్రీవారికి గాయమైనపుడు వచ్చిన రక్తంతో ఎర్రచందనం చెట్లు పుట్టాయి. అందుకే శేషాచలంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా అవి కనిపించవు' అన్న పవన్ వ్యాఖ్యల వెనుక.. ఎర్రచందనాన్ని వేంకటేశ్వరస్వామితో ముడిపెట్టి ఆ సెంటిమెంట్‌తో కాపాడేందుకు ప్రయత్నించినట్టుగా కనిపిస్తోంది. అందుకనే శేషాచలం అడవుల్లోని పవిత్ర ఎర్రచందనం వృక్షాలను నరకొద్దంటూ స్మగ్లర్లతో పాటు వారికి సహకరించే స్థానికులకు సైతం విజ్ఞప్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఆపరేషన్ కగార్‌ను గుర్తుచేస్తూ..

ఎర్రచందనం వృక్షాల నరికివేత కొనసాగితే ఆపరేషన్ కగార్ తరహాలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి స్మగ్లర్ల తాటతీస్తామని పవన్ హెచ్చరించారు. కూంబింగ్, నిఘా, తనిఖీలు వంటివి పటిష్ఠంగా చేపట్టాలని, చెట్ల నరికివేతను ఆపడానికి కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలు, చర్యలు గత టీడీపీ ప్రభుత్వ చర్యలను గుర్తుకు తెస్తున్నాయి.



గుంటి మడుగు వాగులోన..

మామండూరు అటవీ గెస్ట్‌హౌస్ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే గుంటి మడుగు వాగు వద్దకు అధికారులతో కలసి పవన్ వెళ్లారు. వాగు ఒడ్డున కూర్చుని, పారే నీటిలో కాళ్లను ఆడిస్తూ ఆహ్లాదంగా గడిపారు. పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. వాగుకు రెండువైపులా ఉన్న చెట్ల వివరాలపై ఆరాతీశారు. ఎర్రచందనం స్మగ్లింగ్, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్‌ఫోర్స్ అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గత టీడీపీ పాలనలో ఏం జరిగిందంటే..

2004-2014 నడుమ పదేళ్ల పాటు శేషాచల అడవుల్లో ఎర్రచందనం వృక్షాల నరికివేత ఇష్టారాజ్యంగా సాగింది. ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు స్మగ్లర్లకు కీలకంగా సహకరించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్ల కోసం చెట్లు నరికేందుకు స్థానికంగా కూలీలను సమకూర్చారు. స్మగ్లర్ల నుంచీ వాటాలు తీసుకుని ఆర్థికంగా బలపడ్డారు. మరికొందరు నేరుగా తామే స్మగ్లర్ల అవతారం ఎత్తారు. వారిలో కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగానూ ఎన్నికయ్యారు. ఎన్నికల్లోనూ స్మగ్లర్ల డబ్బు కీలక పాత్ర పోషించింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి మొత్తం మారింది. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేయడంతో పోలీసులు స్మగ్లర్లను అరెస్టు చేయడమే కాదు పీడీ యాక్టు ప్రయోగించారు. అందులో కొందరు టీడీపీ నేతలున్నా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. ఐజీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. సిబ్బంది సంఖ్యను పెంచి, ఆయుధాలు కూడా అందించారు. అప్పట్లో శేషాచల అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ దెబ్బకు తమిళనాడు నుంచీ కూలీలు రావడం ఆగిపోయింది. ఇపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరు సరిగ్గా నాటి ప్రభుత్వ నిర్ణయాలను గుర్తుచేస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కూడా కఠిన వైఖరి తీసుకుంటోందనే సంకేతాలను ఇస్తోంది.



నేడు ముసలిమడుగుకు పవన్‌కల్యాణ్

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

పలమనేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం ఉదయం పలమనేరు సమీపంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంపును సందర్శించనున్నారు.తిరుపతి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10.35గంటలకు పెంగరగుంట వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు ఆయన చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డుమార్గాన కారులో ముసలిమడుగులోని కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరానికి 10.50గంటలకు వస్తారు.కుంకీ ఏనుగుల శిబిరాన్ని, గజారామాన్ని, నగరవనాన్ని ప్రారంభిస్తారు.అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడతారు.12.45గంటలకు తిరుగుప్రయాణమవుతారు.ఈ నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు.జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, పలమనేరు ఆర్డీవో పి. భవాని, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ ఏర్పాట్ల గురించి కలెక్టర్‌కు వివరించారు.



పెంగరగుంట వద్ద సిద్ధమైన హెలిపాడ్



ఏర్పాట్లపై అటవీశాఖ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్



రామకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాంతంలో శనివారం దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 7.30 గంటల వరకు కూడా మంచు ముసుగు తొలగలేదు. వాహన చోదకులు హెడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు.సూర్యోదయ వేళ నలుపు, తెలుపు, నీలి మేఘాల మధ్య దోబుచులాడుతూ బంగారు వర్ణంలో భానుడు ధగధగలాడుతూ దర్శనమిచ్చాడు.

మంచు దొంతరల మధ్య సూర్యోదయం

మద్యంతాగి పాఠశాలకు వచ్చిన టీచర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఏర్పేడు మండలం ఆముదూరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లారు. పల్లం హరిజనవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు సి.నాగరాజును డిప్యుటేషన్‌పై అక్కడికి పంపారు. ఆయన మద్యం తాగి విధులకు హాజరవడమే కాకుండా పాఠశాల ఆవరణలో పడిపోయారు. తరగతిలో ఆయన తీరుతో విద్యార్థులను భయబ్రాంతులకు గురిచేశారు. ఈ విషయంపై విచారణ జరపాలని ఎంఈవోను డీఈవో ఆదేశించారు.ఆ నివేదిక ఆధారంగా నాగరాజును విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఈవో తెలిపారు.



హర్దీప్ సింగ్ పూరి - ఆర్కే రోజా - కుటుంబ సభ్యులతో అర్జున్ - ప్రియ - మాన్య



జస్టిస్ సుధీర్ కుమార్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి ఆర్కే రోజా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే సినీ హీరో అర్జున్, నివేదిత దంపతులు, వారి కుమార్తెలు హీరోయిన్ ఐశ్వర్య, అంజన, నటి ప్రియ, గాయని మాన్య కూడా తిరుమలేశుడ్ని దర్శించుకున్నారు. దర్శనానంతరం హీరో అర్జున్ మీడియాతో మాట్లాడారు.. తాను నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించి చిత్రీకరించిన 'సీతా పయణం' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుందన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,075

తలనీలాలు సమర్పించినవారు: 26,535



కుప్పం @ఇండస్ట్రియల్ హబ్

- రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన
- 22వేలమందికి ఉపాధి అవకాశాలు



హిండాల్కో కంపెనీ శంకుస్థాపన సందర్భంగా ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ తదితరులు



కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం యువత కలలు పండనున్నాయి.వలసలను ఆపి ఉపాధి అవకాశాలను పుష్కలంగా పెంచే జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఇక్కడకు తరలి వస్తున్నాయి.కుప్పంలో ఏకంగా ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.రూ.2,203 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలతో 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించారు. రాబోయే మూడు నెలల కాలంలో రూ.6,630 కోట్లతో మరో 8 పరిశ్రమలు తెస్తామని, వీటి ద్వారా ఏకంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు.శంకుస్థాపన కార్యక్రమంలో కుప్పంనుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్,ఆయా కంపెనీల సీఈవోలు, ఇతర ముఖ్య ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలే అధికం

కుప్పంలో ఏర్పాటు కాబోయే 7 పరిశ్రమల్లో వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే అధికం. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో స్థాపించనున్న మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, గుడుపల్లె మండలం పొగురుపల్లెలో ఏర్పాటు చేయనున్న శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్ యూనిట్లు వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే. మదర్ డెయిరీ ఫ్రూట్‌పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 41.22 ఎకరాలు, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు చెందిన డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమల్ ఫీడ్‌కు 47.49 ఎకరాలు, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు 18.68 ఎకరాలు, ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంటడ్స్‌కు 73.63 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పల్లారపల్లె వద్ద ఏర్పాటు కానున్న అలీప్ పరిశ్రమకు చెందిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్ (మహిళా శక్తి భవన్)కోసం 18.7 ఎకరాలు, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఏర్పాటు కానున్న ఈ-రాయిస్ మోటార్స్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 25 ఎకరాలు, హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రాక్షన్ ఫ్యాక్టరీకి 16.3 ఎకరాల కేటాయింపు జరిగింది. ఈ మొత్తం పరిశ్రమల స్థాపనవల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన	
		డైరెక్ట్	ఇన్‌డైరెక్ట్
అలీప్	26.7	1,000	2,500
మదర్ డెయిరీ	260	850	3,150
ఏస్ ఇంటర్నేషనల్	525	2,000	5,000
ఈ-రాయిస్ మోటార్స్	200	280	130
శ్రీజ మిల్క్	233	850	3,150
హిండాల్కో ఇండస్ట్రీస్	586	613	307
ఎస్వీఎఫ్ సోయా	372.8	1,500	1000

తిరుమలలో నేడు కార్తీక వనభోజనం

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన కార్యక్రమానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా కార్తీకమాసంలో పాపవినాశన మార్గంలోని పార్వేట మండపంలో ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆదివారం ఉదయం మలయప్పస్వామి చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకీపై బయలుదేరి ఊరేగింపుగా పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజనం కార్యక్రమం జరుగుతుంది. మండపం సమీపాన అటవీప్రాంతంలో ఉన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. వనభోజన కార్యక్రమం నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కల్యాణకట్ట, లడ్డూకౌంటర్ల వద్ద హెల్ప్ డెస్క్‌లు

- అధికారులకు అదనపు ఈవో ఆదేశం



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కల్యాణకట్ట, లడ్డూ కౌంటర్ల వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా గత నెలలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపై చర్చించారు. కాలిబాట మార్గాల్లో ఎస్టేట్, హెల్త్ విభాగాలు తరచూ తనిఖీలు నిర్వహించాలని, దుకాణాల్లో వస్తువుల ధరలను పర్యవేక్షించాలన్నారు. అన్నప్రసాద భవనంలో చేతులకు తొడుగులు ధరించి ప్రసాదాలు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. లగేజీ కౌంటర్ వద్ద భక్తులకు సకాలంలో లగేజీ అందేలా సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏటీసీ నుంచి అక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్లలో అన్నప్రసాదం, తాగునీరు అందేలా చూడాలన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గోపార్క్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి పార్కింగ్ సమస్యల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు సమావేశంలో డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న స్వర్ణముఖి నదీ హారతులు

శ్రీకాళహస్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నెల 19వ తేదీ బుధవారం స్వర్ణముఖి నదీ హారతులు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, బిల్వ నిమజ్జనం, స్వర్ణముఖి నదీ హారతులు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రాహుకేతు పూజలు మినహా మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



గోదాములో 'ఎర్ర బంగారం'

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్య

మంగళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదాములో ఉండేది 2.6 లక్షల ఎర్రచందనం దుంగలు. వీటి విలువ దాదాపు రూ.పది వేల కోట్లు. ఈ గణాంకాలు తెలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశ్చర్యపోయారు. గోదాములో 'ఎర్ర బంగారం' నిల్వ చేసినట్లుంది అంటూ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన తిరుపతి నగరం తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎర్రచందనం కేంద్ర గోదామును పరిశీలించారు. ఈ దుంగలు ఎంత పటిష్టంగా ఉంటాయో తెలుసుకోవడానికి సుత్తి తీసుకుని కొట్టి పరీక్షించారు. ఏ, బీ, సీ, నాన్ గ్రేడ్‌గా వర్గీకరించిన దుంగలు, బై ప్రొడక్ట్స్‌ను పరిశీలించారు. ఒక చెట్టును రెండునుంచి మూడు దుంగలుగా స్మగ్లర్లు నరుకుతారని అధికారులు తెలిపారు. ఈ లెక్కన శేషాచల కొండల్లో తెలిసి రెండు లక్షల చెట్లను నరికేస్తే.. తెలియకుండా ఇంకెంత నరికేశారోనని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడున్న దుంగలను ఎత్తుకుని వాటి బరువు పరిశీలించారు. గ్లోబెల్ టెండర్లు నిర్వహిస్తున్న సమయంలో చూపించేది ఒకటి.. వారికి ఇస్తున్నది మరొకటన్న అపవాదు ఉందని అడగ్గా.. అందుకు అవకాశంలేదని అటవీశాఖ అధికారులు సమాధానమిచ్చారు. దుంగలు పట్టుబడగానే గ్రేడ్లుగా విభజించి నంబరింగ్ చేస్తామని, వాటిని మార్చడం జరగదన్నారు. కొనుగోలుదారులు ఎంపిక చేసుకున్న వాటినే ఇవ్వాలని పవన్ స్పష్టంచేశారు. బైప్రొడక్ట్ తీసుకున్నవారు ఎందుకువినియోగిస్తారు వీటితో ఏం చేస్తారని ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదాములో 5,300 టన్నుల ఎర్రచందనానికి ఏడాదికి దాదాపు పదివేలకోట్లకు గాను రూ.1.28కోట్లు బీమా చేసినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 45నిమిషాల పాటు ఎనిమిది గోదాములను చూశారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఓఎస్డీ శివరాంప్రసాద్, సీసీఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మామండూరులో పవన్

- అరుదైన మొక్క నాటిన డిప్యూటీ సీఎం

తిరుపతి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. అడవిలో నాలుగు కిలోమీటర్లపైగా ప్రయాణించారు. ఇందులో రెండు కిలోమీటర్ల మేర నడుస్తూ ప్రతి చెట్టునూ పరిశీలించారు. ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణముఖీ నది ఎక్కడి నుంచి ఉద్భవిస్తుందనే వివరాలూ అడిగారు. మామండూరు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన వేదిక సమీపంలో జీవవైవిధ్యం కలిగిన 61 మొక్కలను ఏర్పాటుచేశారు. ఇందులో అండమాన్ నుంచి తెప్పించిన అండమాన్ సైకస్, సైకస్ స్ఫీరికా (జామంతి చెట్టు)మొక్కలను నాటి నీరు పోశారు. గాలిబుడగ, చింతచిల్లి, తూరిపూవు ఎర్రగించ గడ్డి, ఆఫ్రికా మహాగని, సముద్ర జడి, సింధూర చెట్టు, గుగ్గిలం, గురివింద వంటి మొక్కలను అక్కడ అధికారులు నాటారు. బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా పిలిచే దీనిని మియావాకి ఫారెస్టుగా మారుతుందని అధికారులు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర అటవీ అధికారులు ఉన్నారు. మామండూరుకు పవన్ వస్తున్నారని తెలిసి జనసేన శ్రేణులతో పాటు స్థానిక కూటమి నాయకులు అక్కడకు చేరుకున్నారు. అయితే అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన గేటు లోపలకు మాత్రమే కొందరు నాయకులకు అనుమతించి.. లోపలికి వెళ్లకూడదని ఆంక్షలు పెట్టారు. దీంతో నాయకులు కొంతసేపు వేచివుండి పవన్ రాక ముందే తిరిగి వెళ్లిపోయారు. అభిమానులనూ పోలీసులు అనుమతించలేదు.

'ఎర్ర' స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడేలా చర్యలుండాలని స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని అధికారులు వివరించారు. 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలు, 10,450 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదుచేసి 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.





ఒకే వేదికపై తండ్రీ కొడుకులు

ఒకరు డిప్యూటీ సీఎం పవన్ వ్యక్తిగత కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్.మధుసూదన్. మరొకరు తిరుపతి అర్బన్ తహసీల్దారు రామచంద్ర. వీరిద్దరూ తండ్రీ కొడుకులు. శనివారం పవన్ పర్యటనలో.. విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో తండ్రి జి.రామచంద్ర.. కుమారుడు మధుసూదన్ ఒకే వేదికపైకి చేరారు. వీరిద్దరితో పవన్‌కల్యాణ్ ఫొటోదిగి అభినందించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

భక్త కనకదాసుకు నివాళి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్తకనకదాసు 538 జయంత్యుత్సవాలు శనివారం కలెక్టరేట్‌లో జరిగాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి, గాయకుడు, రచయిత, సంఘసంస్కర్తగా సమాజంలో నెలకొన్న అనేక దురాచారాలను దూరంచేయడానికి కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, బీసీ సంక్షేమశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న, జిల్లా కురబసంఘం నాయకులు పాల్గొన్నారు.



తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

తిరుపతి(నేర విభాగం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన వృద్ధుడిని శనివారం తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీవారి దర్శనార్థం మన్యం జిల్లా పర్వతీపురానికి చెందిన నల్ల గంగునాయుడు(72) డిసెంబరు 28న కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద తప్పిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించగా, సిబ్బంది సీసీటీవీ దృశ్యాలు పరిశీలించారు. ఆయన విష్ణు నివాసం నుంచి బయటకు వెళ్ళినట్లు గుర్తించారు. ఆయన ఫొటో, వివరాలను కమాండ్ కంట్రోల్ సిబ్బంది వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సెక్యూరిటీ దేవేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కాల్ చేసి, ఆ వృద్ధుడు ఆఫీస్ సమీపంలో తిరుగుతున్నట్లు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు నల్ల శివకు తెలియజేయగా, వెంటనే కంట్రోల్ రూమ్ చేరుకొని తమ తండ్రిని తీసుకెళ్లారు. పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

వర్షం నుంచి రక్షణగా..

అలిపిరి కాలిబాటలో ఫైబర్ షీట్లతో పైకప్పు ఏర్పాటు

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు వర్షం నుంచి ఉపశమనం కల్పించేలా ఫైబర్ షీట్లతో టీటీడీ పైకప్పు ఏర్పాటు చేసింది. సాధారణంగా మొక్కులున్న భక్తులు శ్రీవారిమెట్టు మార్గానికంటే అలిపిరి కాలినడక మార్గాన్నే అధికంగా వినియోగిస్తారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం (ఎన్ఎస్ టెంపుల్) నుంచి మోకాళ్లమెట్టు వరకు రోడ్డు వెంబడే ఉన్న నడకమార్గంలో కొంతభాగం పైకప్పు లేదు. దీంతో ఎండ, వర్షం సమయాల్లో భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వేసవిలో ఎండ నుంచి ఉపశమనం కల్పించేలా పైభాగంలో తాత్కాలికంగా రేకులు వేసి పచ్చటి వస్త్రంతో పైకప్పును ఏర్పాటు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తాత్కాలిక పైకప్పు లీకవడంతో భక్తులు తడిచిముద్దయ్యారు. ఈ క్రమంలో తొలిసారిగా దాదాపు కిలోమీటరున్నర దూరం పాటు తెల్లటి ఫైబర్ షీట్లతో పైకప్పును ఏర్పాటు చేశారు.



ఇమామ్ జీవితం ఆదర్శప్రాయం

- ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో సజ్జల

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇమామ్ జీవితం ఆదర్శప్రాయమని, మానవత్వం మరచిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసం దగ్గర ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్న వ్యక్తుల్లో ఇమామ్ అరుదైన వారని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 53 ఏళ్లుగా ఇమామ్ తెలుసునని, తనతో పాటు జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమంలో ఇమామ్ కీలకపాత్ర పోషించారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇమామ్ లాంటి వ్యక్తులు వైసీపీకి అండగా నిలవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ఇమామ్ అంటే మత గురువు అని, మొదట మిత్రుడిగా పరిచయమై తర్వాత గురువవుతారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇమామ్ గొప్పతనాన్ని అందరికీ చాటాలన్నారు. అనంతరం ఇమామ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.



ఇమామ్ ప్రస్థానం గ్రంథావిష్కరణ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, నారాయణస్వామి, ఇమామ్ తదితరులు

కుప్పానికి పరిశ్రమలు తీసుకురావడం

చాలా సంతోషాన్నిస్తోంది

సీఎం చంద్రబాబు



పరిశ్రమల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 8 సార్లు ఓటేసి తనను గెలిపించిన కుప్పం నియోజకవర్గ ప్రజలకు మేలు జరిగేలా పరిశ్రమలు తీసుకు రావడం చాలా సంతోషాన్నిస్తోందని సీఎం చంద్రబాబు చెప్పారు. కుప్పంలో ఏడు పరిశ్రమలకు శనివారం ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులు, రైతులు, నియోజకవర్గ ప్రజలతో ముఖాముఖిలో పాల్గొని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితోపాటు తమ ప్రభుత్వం సంక్షేమానికి కూడా పెద్దపీట వేస్తున్నదన్నారు.సంజీవిని ప్రాజెక్టు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య రికార్డులను ఆన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని కుప్పంనుంచే పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. త్వరలోనే రాష్ట్రమంతటా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని చెప్పారు.మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును తొలుత కుప్పంలోనే మోడల్‌గా అమలు చేశామని గుర్తు చేసిన సీఎం, రైతులంతా ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం వైపు చూపు సారించాలని సూచించారు. కుప్పం కరువు దూరం చేసేలా 700 కిలోమీటర్లకు పైగా దూరంనుంచి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను తరలించి ఇక్కడి భూములు నీరులు పండేలా చేశామని తెలిపారు. భూగర్భ జలాలు 4-8 మీటర్ల పైకి వచ్చేలా, పరిశ్రమలకు, వ్యవసాయానికి, తాగుకు పుష్కలంగా నీరు లభించేలా ఈ ప్రాజెక్టును మరింత పురోగతిలోకి తీసుకు వస్తామని చెప్పారు.గుడుపల్లె మండలం పొగురు పల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు,కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో పరిశ్రమలకు సీఎం చంద్రబాబు చేసిన వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అలాగే ఆయా మండల కేంద్రాలు, ముఖ్యమైన పంచాయతీ కేంద్రాల్లో సైతం ఈ కార్యక్రమాన్ని డిజిటల్ తెరపై ప్రదర్శించారు.

సామాజిక సంస్కర్త భక్త కనకదాసు



భక్తకనకదాసు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విశిష్ట కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా భక్త కనకదాసు గుర్తింపు పొందారని ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో భక్త కనకదాసు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఎస్పీ మాట్లాడుతూ భక్త కనకదాసు రచనలు ప్రజల్లో భక్తిని, మానవతను, సమానత్వాన్ని, న్యాయాన్ని, సత్యాన్ని బోధించాయన్నారు. భక్త కనకదాసు జీవితం కులమత భేదాలను తుడిచిపెట్టిన మానవతా విలువల ప్రతీకగా నిలిచిందన్నారు. పోలీసుశాఖ ప్రజాసేవలో న్యాయం, నిబద్ధత, సత్యం వంటి విలువలను నిలబెట్టేందుకు కృషి చేస్తుందన్నారు. భక్త కనకదాసు ఆలోచనలు ఈ విలువలకు ప్రేరణను ఇస్తాయన్నారు. పోలీసు అధికారులు భక్త కనకదాసు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్యాయత్నం



రైలు కింద పడిన యువతిని ఆస్పత్రికి తరలిస్తున్న రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... శుక్రవారం రాత్రి ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరు రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి వైపుకు కదులుతుండగా, స్టేషన్ సమీపంలో తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన యువశ్రీ(21) అనే యువతి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో ఆమె ఎడమ కాలు మాత్రం రైలు చక్రాల కింద పడి నలిగింది. ఆమెను రైల్వే అధికారులు చికిత్సల కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న కనుమ మలుపులో టిప్పర్ బోల్తా



వెదురుకుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని చిన్న కనుమ మలుపు వద్ద శనివారం ఓ టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం వైపు నుంచి కార్వేటినగరం వైపు డస్ట్‌తో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. టిప్పర్ ఢీకొనడంతో రోడ్డు పక్కనే వున్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది.

రైలు కింద పడి యువకుడి మృతి



రాకేష్ (ఫైల్ ఫొటో)

గుడుపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన గుడుపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... గుడుపల్లె రైల్వే స్టేషన్ వద్ద నివాసం ఉంటున్న రాధాకృష్ణ కుమారుడు రాకేష్ (22) కుప్పంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. రాకేష్ తరచూ తన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకునేవాడు. తన స్నేహితుల వద్ద ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేందుకు అప్పులు చేసేవాడు. రాకేష్ తండ్రి అప్పుల విషయం తెలియడంతో పలు మార్లు అతడిని మందలించాడు. అయినా ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం మానలేదు. శుక్రవారం తండ్రి తీవ్రంగా మందలించాడు. మనస్తాపానికి గురైన రాకేష్ శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

మేస్త్రీ ఆత్మహత్య



మహేంద్ర మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి ఆటోనగర్‌లో జరిగింది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలానికి చెందిన మహేంద్ర(38) పనుల కోసం తిరుపతికి వచ్చాడు. మేస్త్రీగా పనిచేస్తూ పూలవానిగుంటలో బాబాయి, పిన్ని ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ శుక్రవారం రాత్రి పూలవానిగుంటలో స్నేహితుడి ఇంటికి వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలసి మద్యం తాగారు. ఉన్నఫళంగా మిద్దెపైకి వెళ్లి మొదటి అంతస్తు నుంచి దూకాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





స్వర్ణ రథంపై ఊరేగుతున్న వరసిద్ధుడు - ఆలయ ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

స్వర్ణ రథంపై మాడ వీధుల్లో ఊరేగిన వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శనివారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం నిర్వహించి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపంలో కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి వారి చేత సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో వైభవంగా ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, ఈఈ వెంకటనారాయణ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

● కాలిపోయిన పెళ్లి కోసం తెచ్చిన నగలు, చీరలు



షార్టుసర్క్యూట్‌తో కాలి బూడిదైన ఇల్లు, గృహోపకరణాలు

ఐరాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం పుల్లూరు పంచాయతీ మట్టపల్లె ఎస్సీ కాలనీలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై, రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన పి.కేశవులు, భార్య మునెమ్మలు తమ మనవరాలికి పెళ్లి నిశ్చయం కావడంతో ఇటీవల కొంత బంగారు, వెండిని కొనుగోలు చేశారు. పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు తీసుకొచ్చి ఇంటిలోని బీరువాలో దాచారు. శనివారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన మనవళ్లను నాయనమ్మ మునెమ్మ పొలం వద్దకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో వారి ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు సిల్క్ వైరుతో కనెక్షన్ ఇచ్చారు. సిల్క్ వైరు షార్టు సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు అక్కడే ఉన్న పరుపుపై పడటంతో మంటలు వ్యాపించాయి. దీంతో మంటలు అధికమై ఇల్లు పూర్తిగా కాలి గోడలు బీటలు వారాయి. ఇంటి నుంచి పొగ దట్టంగా వస్తుండటంతో పక్కన ఇళ్లవారు కేశవులకు సమాచారం అందించారు. ఆయన వెనక వైపు కిటికీ నుంచి చూడగా అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించారు. దీంతో గ్రామస్తులు ఇంటిపై నీళ్లు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. మనవరాలి పెళ్లి కోసం తెచ్చిన బంగారు నగలు, వెండి, పట్టు చీరలు అన్నీ దగ్ధమయ్యాయని కేశవులు, మునెమ్మ విలపించారు. తమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకున్నారు.





ఖోఖో జట్ల ఎంపిక

బంగారుపాళ్యం, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-17 బాల, బాలికల జిల్లా ఖోఖో జట్ల ఎంపికను శనివారం మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, సర్పంచు కుప్పాల మురళి ప్రారంభించారు. జిల్లాలోని 7 డివిజన్ల నుంచి 120 మంది బాలురు, 120 మంది బాలికలు పాల్గొనగా, వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశామని హెచ్‌ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. ఈనెల 22 నుంచి 24వ తేదీవరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా తరపున ఆడనున్నట్లు హెచ్‌ఎం చెప్పారు. టీడీపీ మండల ఉపాధ్యక్షులు లోకేష్‌రెడ్డి, కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ నాయుడు, డీఎస్‌డీవో బాలాజీ, ఎస్టీఎఫ్ సెక్రటరీ శారద, ఖోఖో సంఘ కార్యదర్శి శరత్ బాబు, ఎంఈవో 1, 2 నాగేశ్వరరావు, రమేష్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.

నన్నూరివారిపల్లి వద్ద చిరుత కలకలం



పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన మేక

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లి పంచాయతీలో మేకను చిరుత చంపిందనే సంఘటన శనివారం ఉదయం వ్యాపించడంతో మండలంలో కలకలం రేపింది. పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి దళితవాడకు చెందిన వెంకటప్ప ఎప్పటిలాగే శుక్రవారం తన మేకల మందను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం మేకలను ఇంటికి తోలుకొచ్చే సమయంలో ఓ గుట్ట వద్ద మేక అరుపులు వినిపించాయి. అప్పటికే చీకటి పడిపోవడంతో ఇంటికి వచ్చేశానన్నారు. ఇంటికి వచ్చిన మేకల్లో ఒకటి కనిపించకపోవడంతో శనివారం ఉదయం గుట్ట వద్దకు మేకల యజమాని వెళ్లగా చనిపోయిన మేకను గుర్తించాడు. సమీపంలో చిరుత అడుగులు ఉన్నాయని వెంకటప్ప గ్రామస్తులకు తెలిపాడు.

● మేకను చంపింది చిరుత కాదు

నన్నూరివారిపల్లి పంచాయతీలోని గుట్ట సమీపంలో మేకను చంపింది చిరుత కాదని ఎఫ్‌ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు తెలిపారు. సంఘటనా స్థలానికి సమీపంలో ఉన్న పాదముద్రలు పరిశీలించామన్నారు. ఇక్కడ కనిపించిన పాదముద్రలు చిరుతవి కావని, అడవి పిల్లివని స్పష్టం చేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎస్పీ



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎస్పీ తుషార్ డూడీ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. ఆదివారం పలమనేరు మండలంలోని ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంప్‌కు డిప్యూటీ సీఎం రానున్న సంగతి తెలిసిందే. ఆయన పర్యటనను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. మార్గమధ్యంలో పోలీసు పికెటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టామన్నారు. పర్యటనలో ఎలాంటి అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

వరసిద్ధుడి దర్శనానికి

నాలుగు గంటలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి శనివారం నాలుగు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. దీంతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు ఆలయం నుంచి వెలుపల వరకు వ్యాపించారు. క్యూలైన్లలోని భక్తుల దాహార్తి తీర్చడానికి సిబ్బంది తాగునీరు అందించారు. ప్రతి భక్తుడికి స్వామి దర్శనాన్ని కల్పించడానికి ఆలయ అధికారులు కృషి చేశారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

జర్నలిజం పేరుతో ఉద్యోగులను వేధిస్తే చర్యలు

● కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జర్నలిజం పేరుతో ఉద్యోగులను వేధిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసినట్లు ఫిర్యాదులు అందిన ఒక విలేకరి అక్రిడిటేషన్ కార్డును రద్దు చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడడం, వారిని బ్లాక్ మెయిల్ చేయకుండా కార్యాలయంలో నిర్భయంగా పనిచేసే వాతావరణం కల్పించడం తన బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఇద్దరు పాత్రికేయులు మహిళా ఉద్యోగులతో సహా ప్రభుత్వ ఉద్యోగులను పదేపదే బ్లాక్ మెయిల్ చేశారని, బెదిరించడానికి ప్రయత్నించారనేది తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి, ఆ ఇద్దరిలో ఒకరి అక్రిడిటేషన్ కార్డును రద్దు చేశామన్నారు. పౌరులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్ వ్యాఖ్యలపై నిరసన



తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా కలెక్టర్ వ్యవహారశైలిపై శనివారం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. వార్తలు రాసే జర్నలిస్టులను లేపేస్తామని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కులను కాలరాసే అధికారం ఎవరిచ్చారని మండిపడ్డారు. కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని విలేకర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండు చేశారు. గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రసాద్, జనార్దన్, మురళి, బాలు, రాజేంద్ర, శీనుబాబు, రాఘవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు

వరి, మామిడి, కొబ్బరి చెట్ల ధ్వంసం



ధ్వంసమైన టమోటా పంటను పరిశీలిస్తున్న ఎఫ్‌ఎస్‌వో మహమ్మద్ షఫి తదితరులు

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి పంటలపై 16 ఏనుగుల గుంపు దాడి చేయడంతో వరి, కొబ్బరి, మామిడిచెట్లకు తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గోపాల్, బసవయ్య, రవికుమార్, అమర్‌నాథరెడ్డి, సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, శాంతమూర్తిరెడ్డి, ఎల్‌వీఎస్ నాయుడు, మోహన్‌కు చెందిన మామిడి, వరి, కొబ్బరిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. శనివారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగులు సంచరించినట్లు అటవీశాఖ అధికారులు మహమ్మద్‌షఫి, కృష్ణమూర్తి, మధు తెలిపారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



రొంపిచెర్లలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంతరించి పోతున్న క్రీడలను పోత్సహించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పిల్లలకు క్రీడా స్ఫూర్తిని నింపాలన్నారు. చదువుతో పాటు ఆటలూ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, పుంగనూరు నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు నాగరాజ, నూకాల నాగార్జున నాయుడు, టోర్నమెంట్ నిర్వాహకులు రౌనక్, షబ్బీర్, అజామ్, ఇమ్రాన్, కరీముల్లా, రామూర్తి, చెంగల్‌రెడ్డి, రఘునాథ్ పాల్గొన్నారు.

దేశభక్తిని పరిరక్షించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ
కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

పుంగనూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పరిరక్షించడం, ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో కొత్తయిండ్లులోని షిరిడి సాయిబాబా ఆలయ మందిరంలో 100 ఏళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతి హిందువు ఇంటిని సందర్శించి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాలను వివరించి హిందువుల ఐక్యతను సాటిచెబుతామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని చదళ్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. చదళ్లలోని తపాలాలో పనిచేస్తున్న వెంకటరమణ, చౌడేపల్లె మండలంలో పని చేస్తున్న వీఆర్వో నాగేశ్వర్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన మౌలాలు పరారీ కావడంతో అక్కులప్ప, భాస్కర్‌రెడ్డి, శంకరప్పలను అదుపులోకి తీసుకోగా.. వారి నుంచి నగదు రూ.18,340 స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

12న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుంగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పుంగనూరులో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు రోటరీక్లబ్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఈనెల 12న ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు తిరుపతి స్విమ్స్ సహకారంతో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పరీక్షలు చేసుకునేవారు ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



సోమల మండల కాంప్లెక్స్‌లో నిరుపయోగంగా మరుగుదొడ్లు

సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కాంప్లెక్స్‌లో రూ. 6 లక్షలు వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు నీటి సౌకర్యం కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. ఏడాది క్రితం నిర్మించిన మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా మారాయి. రెవెన్యూ, వెలుగు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం, దిడ్డివారిపల్లె గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు ఉన్నా వాటికి నీటి సౌకర్యం కల్పించక పోవడంతో కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

శ్రీవారి పాదక్షేత్రంలో విశేష పూజలు



నిజ స్వరూపంలో శ్రీవారు

సదుం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపల్లెలో వెలసిన శ్రీవారి పాదక్షేత్రంలో శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారు నిజ స్వరూపంలో దర్శనమిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు శ్రీవారి పాదాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న సుధారెడ్డి, భక్తులు

చంద్రగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె పంచాయతీ నూలివెంకన్న కొత్తపల్లిలో ముత్యాలమ్మ ఆలయ పదవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కలశారాధన, గణపతి, నవగ్రహ హోమాలు, లలిత సహస్రనామ, శ్రీసూక్త, నవదుర్గ హోమాలు, మహాపూర్ణాహుతి, అనంతరం మూలమూర్తికి పంచాంబృతాభిషేకం, స్నపన అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి, అమ్మవారికి సారె సమర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి,ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, లంకెళ్ల లలితకుమారి, ఎంపీటీసీ ఏసీ శేఖర్, నూలి వెంకన్ననాయుడు, చెన్నంశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



ఎమ్మెల్యేను కలిసిన పీపీఎస్ నాయకులు

పలమనేరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలు నిర్వహించి పలమనేరు అభివృద్ధికి తోడ్పడాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పీపీఎస్ నాయకులకు సూచించారు. జిల్లా స్థాయిలో ఇటీవల పలమనేరు పరిరక్షణ సమితి(పీపీఎస్) సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛాంధ్ర అవార్డును సాధించింది. ఈ సందర్భంగా శనివారం పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమాలను మరింత నిర్వహిస్తూ ముందుకు వెళ్లాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పీపీఎస్ నాయకులు టీఎల్ నరసింహులు, కార్యదర్శి నారాయణ, కార్యవర్గ సభ్యులు విజయకుమార్‌రెడ్డి, పొన్ముడి, రామచంద్ర, విజయకుమార్, రెడ్డెప్ప, వెంకట్ మురళి, శ్రీపురం సీతారామయ్య, వీరభద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటనలో రైతులను అనుమతించాలి

పలమనేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈనెల 9న పలమనేరు సమీపంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంపునకు వస్తున్న నేపథ్యంలో ఆయన్ను కలిసేందుకు రైతులను అనుమతించాలని జిల్లా రైతు సంఘం నాయకులు ఉమాపతి నాయుడు కోరారు. జిల్లాలో ఏనుగుల దాడులను అరికట్టేందుకు గాను కర్నాటక నుంచి ఇక్కడికి కుంకీ ఏనుగులను తీసుకొచ్చే కార్యక్రమం పవన్‌కల్యాణ్ చేపట్టడం అభినందనీయమన్నారు. అయితే రైతులు ఏనుగులతో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు నేరుగా ఆయన దృష్టికి తీసుకొచ్చేందుకు గాను ఆయన పర్యటనలో రైతులను అనుమతించాలని కోరారు. రైతుల కష్టాలను ఆయనకు వివరించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారని.. కలెక్టర్ స్పందించి అవకాశం కల్పించాలని కోరారు.

ఐదేళ్లలో రైతు సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

రామకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో రైతు సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ పాలనలో పలు తుఫాన్‌లు వచ్చి రైతులు తీవ్రనష్టాలు పాలైతే సీఎం జగన్ కనీసం పరామర్శించలేదని, వారికి తగు నష్టపరిహారం కూడా అందించలేదని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. గత ఏడాదిన్నరగా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను స్వయంగా సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్‌లు పరామర్శించి వారికి భరోసా ఇచ్చారన్నారు. అలాగే నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పరిహారం అందించారని తెలిపారు. వైసీపీ తన పాలనలో ఎకరాకు డ్రిప్ పరికరాలు అందించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే అడిగిన ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు అందిస్తోందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సదుం విద్యార్థి ఎంపిక



మహేంద్ర నాయుడు

సదుం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మహేంద్ర నాయుడు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత గురువారం తిరుపతి తారకరామా స్టేడియంలో జరిగిన 17వ అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్‌లో ప్రథమ స్థానంలోనూ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన మహేంద్ర నాయుడును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ సీఎం.జోషికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని శనివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో ఏపీ వ్యవసాయ శాఖ డిప్యూటీ సెక్రటరీ హరిత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ జోషి, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్ ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వనవేణుగోపాలస్వామి

వెదురుకుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె - ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.

చంద్రబాబు రాకతో కుప్పానికి మహర్దశ



శాంతిపురంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు రాకతో మహర్దశ కలిగిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం శాంతిపురంలో పరిశ్రమలకు సీఎం చంద్రబాబు వర్చువల్ శంఖుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తొలిసారిగా కుప్పం శాసన సభ్యుడిగా పోటీ చేసినప్పుడే మారుమూల గ్రామాలను సందర్శించి ప్రజల బాధలను గుర్తించారన్నారు. మంత్రిగా, సీఎంగా ఆయన కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఈ సారి సీఎం అయిన తర్వాత తరాతరాలుగా కుప్పం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. హంద్రీ-నీవాతో కృష్ణాజలాలు తీసుకొచ్చి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యకు చెక్ పెట్టారన్నారు. అలాగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచేందుకు ప్రస్తుతం విరివిగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. భవిష్యత్‌లో ఇక్కడి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం వలసబాట పట్టకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందింగం ఉదయ్‌కుమార్, మంజునాథ్, మాజీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం అభ్యున్నతికి చంద్రన్న తపన

రామకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజల బాగోగుల కోసం సీఎం చంద్రబాబు నిరంతరం తపిస్తుంటారని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి తెలిపారు. శనివారం కుప్పంలో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా చేసిన శంఖుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గాన్ని మంత్రిగా, సీఎంగా చంద్రబాబు అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. నేడు మునుపెన్నడూ జరగనంతగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించారన్నారు. సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం వందల కోట్లు వెచ్చించి హంద్రీ-నీవా కాలువ ద్వారా నియోజకవర్గానికి కృష్ణాజలాల తీసుకొచ్చారన్నారు. స్థానిక యువత ఉద్యోగ, ఉపాధి పనుల కోసం వలస వెళ్లడాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తున్నారన్నారు. అలాగే రామకుప్పం మండలంలో మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారని, రైతులు పెద్దమనసుతో వాటి కోసం భూములిచ్చి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, కడ పీఏసీ సభ్యుడు రఘు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు మురళీ, రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, మనోహర్, సతీష్ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామకుప్పంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని తిలకిస్తున్న నాయకులు, ప్రజలు

ప్రకాశవంతం.. కార్తీక దీపోత్సవం





సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద వనాల్లో కార్తీక వెలుగులు

రామకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద, ఆలయం వెనుక గల త్రిమూర్తి, రాశి, నక్షత్ర, నవగ్రహ వనాల్లో వందలాది దీపాలు వెలిగించారు. అక్కడి వినాయకుడు, పార్వతి, పరమేశ్వరులు, సుబ్రహ్మణ్యస్వామి మూర్తుల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యర్థాలతో కలుషితమైన కీలపల్లె చెరువు



వ్యర్థాలతో నిండిన వి.కోట కీలపల్లె చెరువు

వి.కోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వి.కోట కీలపల్లె చెరువు ఐదేళ్ల అనంతరం పూర్తి స్థాయిలో నిం డిం ది. మరో రెండు, మూడు రోజుల్లో చెరువు మొరవ ప్రవహించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి చెరువు నిండు కుండలా కళకళలాడుతోంది. ఎగువ నుంచి హంద్రీ-నీవా జలాలకు, ఇటీవల కురిసిన వర్షాలు తోడవ్వడంతో పట్రపల్లె, దాసార్లపల్లె, ముదిమడుగు చెరువుల నుంచి పెద్దఎత్తున వరద నీరు కీలపల్లె చెరువుకు వచ్చి చేరుతోంది. కుప్పం ప్రధాన రహదారి పక్క నుంచి వెళ్లేటప్పుడు చెరువులో నీటి అలలు చూపరులను ఆకట్టుకుంటోంది. అయితే చెరువులో గతంలో పడేసిన వ్యర్థాలు నీటిపై తేలియాడుతూ దుర్గంధం వెదజల్లుతోంది. సహజంగా చెరువుకు కొత్తగా నీరు వచ్చి చేరినప్పుడు తెల్లటి వర్ణంలో ఉండాలి. అయితే నీరు పూర్తిగా రంగుమారి బురద రంగులో ఉన్నాయి. చెరువులో ఉన్న వ్యర్థాల కారణంగా నీరు రంగుమారినట్లు తెలుస్తోంది. చెరువు నిండటంతో చూసేందుకు వస్తున్న వారికి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు తేలియాడుతూ కనిపించడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. వి.కోట కీలపల్లె చెరువు నిండితే మరో రెండేళ్లు దిగువనున్న చాలా పంచాయతీలకు తాగు, సాగు నీరు అందుబాటులో ఉంటుంది. కీలపల్లె చెరువు కలుషితమవ్వడంపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ వ్యర్థాలను తొలగించి, నీటి కాలుష్యం నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం పవన్ రాకతో సందడి

తిరుపతి రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం మధ్యాహ్నం తనపల్లె రోడ్డులోని తాజ్‌హోటల్‌కి చేరుకున్నారు. ఆయన్ను కలిసేందుకు స్థానిక జనసేనపార్టీనేతలు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఎక్కువసంఖ్యలో చేరుకోవడంతో హోటల్ బయట సందడి నెలకొంది.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్ప స్వామి పూజల్లో భక్తులు

రొంపిచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక శనివారాన్ని పురస్కరించు కొని ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో, పచ్చని తోరణాలతో అలంకరించారు. అయ్యప్ప మాలధారణలోని భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టారు. భక్తులకు గురుస్వామి హారతులిచ్చి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

11న రొంపిచెర్ల మండల సమావేశం

రొంపిచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 11 వ తేదీన ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సోమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. శనివారం కందూరు రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల కల్వర్టు కొట్టుకు పోవడంతో ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, పంటలు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించడం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పి. శ్రీనివాసులు, బాలకృష్ణ, సతీశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటానికి
నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులు



బైరెడ్డిపల్లెలో కనకదాసు చిత్రపటానికి పూజలు

పలమనేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం కనకదాసు జయంతి ఘనంగా నిర్వహించారు. పలమనేరు కురబ సంఘ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై కనకదాసు చిత్రపటానికి నివాళులర్పించారు. కనకదాసు చూపిన మార్గంలో అందరూ నడిచి ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంగౌడు, కురబ సంఘ నాయకులు సోమశేఖర్‌గౌడు, బత్తిగౌడు, నాగభూషణం, సుబ్బన్న, ఈశ్వరగౌడు, శివ, విశ్వనాథ, చలపతి, కూటమి నాయకులు బాలాజీ, రామచంద్ర నాయుడు, బ్రహ్మయ్య, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలో శనివారం సాయంత్రం కనకదాసు జయంతి వేడుకలను కురబ సంఘం నాయకుడు, పాతూరునత్తం మాజీ సర్పంచ్ గౌరప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్లకూడలి వద్ద కనకదాసు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కురబసంఘం నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు


జస్టిస్ సీఎం.జోషికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని శనివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో ఏపీ వ్యవసాయ శాఖ డిప్యూటీ సెక్రటరీ హరిత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ జోషి, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్ ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం


ప్రత్యేక అలంకరణలో వనవేణుగోపాలస్వామి

వెదురుకుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె - ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.

30 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తిరేవుల పంచాయతీ వడ్డార్లపల్లి వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు జరుగుతాయని కార్యనిర్వాహకులు నరసింహులు నాయుడు, శ్రీధర్ రెడ్డి, కె.ఆర్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా శివశంకర్


శివశంకర్, సురేష్

వెదురుకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా శివ శంకర్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, ఆర్థిక కార్యదర్శిగా కార్తీకేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు శనివారం తెలిపారు. కార్వేటినగరం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలకు ఢంకా హమీద్ బాషా ఎన్నికల అధికారిగా వ్యవహరించారని తెలిపారు. ఎస్టీయూ మండల గౌరవ అధ్యక్షులుగా శివాజీ, మురుగేశం, అసోసియేట్ అధ్యక్షులుగా నరేష్, వేణుగోపాల్, అమరనాథ్, రంజిత్, గురవయ్య, అదనపు ప్రధాన కార్యదర్శులుగా బాబు, ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా యుగంధర్, వాసుదేవ్, మనోజ్, రఘురామకృష్ణరాజు, జగదీషన్, అన్నూరు చంద్రశేఖర్, కార్యదర్శులుగా పురుషోత్తం, సుధాకర్, నరసింహులు, ఉమాపతి, మహేష్, సెల్వి, శ్రీదేవి, ఫామిదాబీ, జయలక్ష్మి, మహిళా కన్వీనర్లుగా శాంతి, సునీత, నాగజ్యోతి, యశోద, రేఖ, మమత ఎన్నికయ్యారని తెలిపారు. సీపీఎస్ కన్వీనర్లుగా దాము, లక్ష్మీప్రసాద్, ఫరూక్‌తుల్లా, సుజిత, హిమబిందు, ఉన్నత పాఠశాల కన్వీనర్లుగా మర్రి శేఖర్, మునిరాజ, పురుషోత్తం, పరంధామ, అక్కారిబాబు, మోహన్‌మురళి, గుర్రప్ప, లలిత, మోహన్‌యాదవ్ ఎంపికైనట్లు వారు చెప్పారు.

చినబాబుకు పలువురి శుభాకాంక్షలు


చినబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకులు

విజయపురం, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు జన్మదినోత్సవం సందర్భంగా శనివారం పలువురు టీడీపీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుత్తణి, తిరుపతిలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. చిత్రపటాలు, శాలువాలతో చినబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, హరికృష్ణా, మురళీ, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నగరి(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పుట్టిన రోజు పురస్కరించుకుని నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కుమార్ నాయుడు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, విజయపురం పీఏసీఎస్ అధ్యక్షుడు బాబు, అలెక్స్ రాజా, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఈఎస్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు గెలుచుకున్న పీఈఎస్ విద్యార్థులు

యాదమరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్దానపల్లిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు వేలూరు వీఐటీ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన 'కంఫెస్ట్' పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమానికి 41 పాఠశాలల నుంచి దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీఈఎస్ పాఠశాలకు చెందిన జి.భవిష, జి.అక్షయ చంద్రలు 'టెర్మ్ స్టార్స్' పోటీలో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. డి.నక్షత్ర, ఎస్.రోహిణి, ఎం.తనూజలు 'ఎకో సమ్మిట్' పోటీలో మూడవ బహుమతిని సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను కామర్స్ అధ్యాపకులు రజనీకాంత్, జ్యోత్స్నలను ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అభినందించారు.

డీమార్ట్ ప్రారంభం



చిత్తూరు సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన డీమార్ట్ స్టోర్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరుకు మరిన్ని పెద్ద కంపెనీల స్టోర్లు రావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చెట్లు నరకడంపై కేసు నమోదు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా తన భూమిలోని చెట్లు నరికిన రైతుపై వాల్టా యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ పశ్చిమ రేంజ్ ఎఫ్ఆర్వో పట్టాభి తెలిపారు. చిత్తూరు తేనెబండలో నివాసముంటున్న ఇళయరాజా భూమిని పరిశీలించగా, అందులోని మూడు గంగిరావి, ఒక వేప చెట్టు నరికినట్లు గుర్తించామన్నారు. చెట్లు నరికేందుకు ఇళయరాజా అనుమతి తీసుకోలేదన్నారు. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు అతన్ని కార్యాలయానికి పిలిపించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా తన సొంత భూమిలో చెట్లు నరుక్కుంటే, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అటవీ అధికారులు తనను కార్యాలయానికి తీసుకొచ్చి నిర్బంధించారని ఇళయరాజా ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని, కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

వెదురుకుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి కాలనీకి చెందిన కార్తీక్ తన ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ట్రైనీ ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

స్వదేశీ వస్తువులనే వాడాలి: బీజేపీ



స్వదేశీ వస్తువుల వాడకంపై స్టిక్కర్లతో ప్రచారం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే వినియోగించాలనే దానిపై బీజేపీ శ్రేణులు శనివారం నగరంలో స్టిక్కర్లు ఇస్తూ ప్రచారం చేశారు. ఆటోలు, దుకాణాల్లో స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్, వాసు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనా విధానం మారాలి


సమావేశంలో మాట్లాడుతున్న బోడే రామచంద్రయాదవ్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. శనివారం చిత్తూరు సీతమ్ కళాశాలకు వచ్చిన ఆయన ఇటీవల జరిగిన విద్యార్థుల ఘటనలపై యాజమాన్యంతో ఆరాతీసి, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడిని జయించడంతో పాటు ఆలోచనా విధానాల్లో మార్పు వచ్చినప్పుడు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తు చేశారు. క్షణికావేశాలకు గురికాకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డీకే బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, బీసీవై నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

40 గ్రాముల బంగారు నగల చోరీ

చిత్తూరు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాన్ని పగులగొట్టి బంగారు, నగదును దోచుకెళ్లారు. నగరంలోని కట్టమంచిలో నివాసముంటున్న శ్రీనివాసులురెడ్డి కుటుంబంతో కలిసి ఈ నెల 6వ తేదీన తిరుపతిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి 7వ తేదీ ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసిన వారు ఇంట్లో ఉన్న వస్తువులను సరిచూసుకున్నారు. బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు నగలు, రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర కేసు నమోదు చేశారు.

బస్సు సౌకర్యంపై హర్షం

గుడిపాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మామూలుగా గ్రామాలకు రాజకీయ నేతలు వస్తే సమస్యలు అడిగినప్పుడు చేస్తాం.. చూస్తాం... అని చెప్పి కాలయాపన చేసేవారు. సమస్య మాత్రం ఏళ్ల తరబడి అలాగే ఉండిపోయేది. గత ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్యేగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్ అడవిచేను, బొమ్మసముద్రం, గొల్లమడుగు గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు మేము అడక్కపోయినా గుర్తు పెట్టుకుని ఎట్టకేలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: టీడీపీ

గుడిపాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, యువ నాయకుడు శరత్ అన్నారు. శనివారం మండల బీసీసెల్ అధ్యక్షుడు జయచంద్ర అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయన్ను వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆస్పత్రికి అయ్యే ఖర్చులను దగ్గరుండి చూసుకోవాలని ఎమ్మెల్యే గురజాల సూచించారన్నారు. దీంతో చింతగుంటూరు గ్రామానికి వెళ్లి వారు జయచంద్రను పరామర్శించారు.


తిమ్మసముద్రం చెరువు కట్టపై పడేస్తున్న వ్యర్థాలు, చెరువు నుంచి కాలువ ద్వారా బయటికి పంపిస్తున్న వర్షపు నీరు, పైపుల ద్వారా చెరువునీటిని మురుగుకాలువలోకి వదిలిన దృశ్యం, మురుగుకాలువలో ప్రవహిస్తున్న చెరువునీరు

మురుగుకాలువలోకి చెరువు నీరు

● ముందుచూపు లేకపోవడంతోనే ఈ దుస్థితి

చిత్తూరు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని చెరువులో స్టోరేజీ చేసి భూగర్భ జలమట్టాన్ని పెంచాల్సిన అధికారులు ఉన్న నీటిని బయటికి వదిలేస్తున్నారు. ముందుగానే చెరువు కట్టను పటిష్ఠం చేసివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు. 20 ఏళ్ల క్రితం తిమ్మసముద్రం చెరువును లోతు చేయడంతో పాటు చెరువు కట్టను నిర్మించారు. ఆ తరువాత చెరువు పర్యవేక్షణను గాలికి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండిపోయింది. చెరువు కట్ట పటిష్ఠంగా లేకపోవడంతో ముందుగానే పగుళ్లు ఏర్పడటంతో ఇరిగేషన్, నగరపాలక అధికారులు అప్రమత్తమయ్యారు. వారం రోజుల ముందు చెరువు పక్కనే ఉన్న రోడ్డులో జేసీబీ సహాయంతో గాడి తవ్వి నీటిని కిందికి వదిలేశారు. రోడ్డును తవ్వేయడంతో వాహనదారులకు ఇబ్బంది కలగడంతో, రోడ్డును పూడ్చివేసి పైపుల ద్వారా చెరువు నీటిని మురుగుకాలువలో వదిలేశారు. ఓ వైపు ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టుకుని స్టోరేజీ చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుంటే... ఇక్కడేమో చెరువులో చేరిన నీటిని బలవంతంగా కిందికి వదిలేస్తున్నారు. చెరువు కట్టను పటిష్ఠం చేసి భూగర్భజల మట్టాన్ని పెంచాల్సిన అధికారులు నిల్వనీటిని బయటికి వదిలేయటం పట్ల స్థానికులు నోరెళ్లబెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు కట్టను పటిష్ఠం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పాలకూరు
ఆరోగ్య ఉపకేంద్రం


పిచ్చిమొక్కల మధ్య ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

పూతలపట్టు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ పాలకూరులో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అక్కడ విధులు నిర్వహించే సిబ్బందితో పాటు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో దిగువ పాలకూరు ఆరోగ్య ఉపకేంద్రం ఉంది. దీని పక్కనే చెరువు ఉంది. వర్షాకాలంలో చెరువులోకి పూర్తిస్థాయిలో నీరుచేరితే ఆరోగ్య ఉపకేంద్రంలోకి వర్షపు నీటితో పాటు విషపురుగులు వెళ్తున్నాయి. ఉపకేంద్రం గదికి ఉన్న కిటికీలు కూడా ఊడి కిందపడ్డాయి. భవనం పైకప్పు పెచ్చులూడి వర్షానికి ఉరుస్తున్నాయి. దీంతో అక్కడ విధులు నిర్వహించే ఏఎన్ఎంతో పాటు ప్రజలు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలావుండగా ఎగువ పాలకూరులో ఉన్న ఉన్నత పాఠశాల సమీపాన నూతనంగా కమ్యూనిటీ భవనాన్ని ప్రభుత్వ నిధులతో స్థానిక సర్పంచ్ పంకజాక్షి నిర్మించారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజల శ్రేయస్సు కోసం ఆరోగ్య ఉపకేంద్రాన్ని కమ్యూనిటీ భవనంలోకి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వికలాంగ పెన్షన్ ఇప్పించండి సార్!


ధ్రువీకరణపత్రాన్ని చూపుతున్న కుప్పయ్య

బంగారుపాళ్యం, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా వికలాంగ పెన్షన్ ఇప్పించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే వారే లేరని ఓ వికలాంగుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని మంగళపల్లె పంచాయతీ వెంకటాపురం దళితవాడకు చెందిన 50 ఏళ్ల కుప్పయ్య రెండేళ్ల క్రితం షుగర్ వ్యాధి కారణంగా ఆయన కుడికాలును పూర్తిగా తీసేశారు. దీంతో అప్పటి నుంచి కుటుంబ పోషణ భారంగా మారింది. ఆయన భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆ సంపాదన కూడా అంతంతమాత్రంగా రావడంతో భర్త చికిత్సల కోసం అప్పులు చేస్తున్నట్లు ఆయన భార్య ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తకు 95 శాతం మేర అంగవైకల్యం ఉన్నట్లు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇచ్చారని, అయినా ఆయనకు పెన్షన్ రాలేదని భార్య ఆవేదన వ్యక్తం చేసింది.

అందని బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్


టీపీఎన్ఆర్.పురంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

పాలసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకుగాను టీపీఎన్ఆర్.పురం, కరిపేరుగుంట, వనదుర్గాపురం, పాలసముద్రం ప్రాంతాల్లో 4జీ టవర్లను బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేసింది. గత రెండుమూడు నెలలుగా ఈ టవర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలకు బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందటం లేదు. కొంత మంది వినియోగదారులు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు కంపెనీల సిమ్‌కార్డులు తీసుకుని వినియోగిస్తున్నారు. మరికొంతమంది బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ పని చేసినప్పుడే వినియోగిస్తున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో ఉన్న సెల్ టవర్లు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ టవర్లు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న వేణుగోపాల్

యాదమరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామానికి చెందిన సురేష్ మూడేళ్ల క్రితం శబరిమలైకి వెళ్లి తప్పిపోయారు. దీంతో ఆయన భార్య, పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ వేణుగోపాల్ స్పందించి ఆ కుటుంబంలోని పిల్లల చదువుకు గాను రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

బాలికలకు కరాటే శిక్షణ ప్రారంభం


కరాటే నేర్చుకుంటున్న బాలికలు

యాదమరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గొల్లపల్లి హైస్కూల్ ప్లస్‌లో 6 నుంచి 9వ తరగతుల బాలికలకు కరాటే శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంచేందుకు 120 మంది బాలికలకు ప్రతి రోజూ సాయంత్రం ఒక గంట చొప్పున కరాటే ట్రైనర్ దివ్య, ఎస్.సింధు శిక్షణా తరగతులు ఇవ్వనున్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం జె.భాస్కర్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు కె.కనకాచారి ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు.

ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

● ప్రమాదాల బారిన ప్రజలు


రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

విజయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నగరి - కనకమ్మసత్రం, చిన్నజంబాడ - నారపరాజుకండ్రిగ, ఎం.అగరం - కేవీపురం, కాళికాపురం - బుగ్గఅళ్లత్తూరు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, దగ్గరకు వచ్చి వాహనాలు కనిపించే సరికి ప్రమాదాలు జరిగి పోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రబాబు రాకతో
కుప్పానికి మహర్దశ


శాంతిపురంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు రాకతో మహర్దశ కలిగిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం శాంతిపురంలో పరిశ్రమలకు సీఎం చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తొలిసారిగా కుప్పం శాసన సభ్యుడిగా పోటీ చేసినప్పుడే మారుమూల గ్రామాలను సందర్శించి ప్రజల బాధలను గుర్తించారన్నారు. మంత్రిగా, సీఎంగా ఆయన కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఈ సారి సీఎం అయిన తర్వాత తరాతరాలుగా కుప్పం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. హంద్రీ-నీవాతో కృష్ణాజలాలు తీసుకొచ్చి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యకు చెక్ పెట్టారన్నారు. అలాగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచేందుకు ప్రస్తుతం విరివిగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. భవిష్యత్‌లో ఇక్కడి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం వలసబాట పట్టకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందింగం ఉదయ్‌కుమార్, మంజునాథ్, మాజీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశవంతం.. కార్తీక దీపోత్సవం



రామకుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద, ఆలయం వెనుక గల త్రిమూర్తి, రాశి, నక్షత్ర, నవగ్రహ వనాల్లో వందలాది దీపాలు వెలిగించారు. అక్కడి వినాయకుడు, పార్వతి, పరమేశ్వరులు, సుబ్రహ్మణ్యస్వామి మూర్తుల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.